సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023



నేటి నుంచి 'అల్పాహారం'

ప్రభుత్వపాఠశాలల్లో ఆకలిని నివారించడం, హాజరు శాతాన్ని పెంచడం లక్ష్యంగా 'సీఎం అల్పాహార పథకం' అమలుకానుంది.

- 10లో ▸



'స్పైస్' కార్యాచరణ ఏమిటి?

పసుపు బోర్డు ప్రకటనతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయదల్చుకున్న 'స్పైస్ పార్క్' కార్యాచరణ ఏమిటనేదానిపై చర్చ జరుగుతోంది.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /18.6

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

20 శాతం ఐఆర్ ప్రకటించాలి



నిజామాబాద్‌నాగారం: ఉద్యోగులు, పెన్షనర్లు గౌరవప్రదంగా జీవించేలా మంచి వేతనాలు ఇస్తామని ప్రకటించారని, ఇటీవల ప్రకటించిన ఐఆర్ దానికి అనుగుణంగా లేదని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఐదు శాతం మధ్యంతర భృతి ప్రకటించడాని వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ఎదుట గురువారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు మెమొరాండం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. ఇటీవల ప్రకటించిన ఐఆర్‌కు అదనంగా మరో 15శాతం మంజూరు చేయాలని కోరారు. గౌరవ అధ్యక్షుడు దత్తాత్రేయరావు, నాయకులు లావు వీరయ్య, సిరప్ప హన్మాండ్లు, ప్రసాద్‌రావు, అందె సాయిలు, లక్ష్మీనారాయణ, రాధాకిష్ట, అశోక్, శ్రీధర్, శంకర్, బాబాగౌడ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రైళ్లు రద్దు

ఖలీల్‌వాడి: రైల్వేట్రాక్ మెయింటెనెన్స్ నేపథ్యంలో పలురైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్–కాచిగూడ, కాచిగూడ–నిజామాబాద్ రైళ్లను ఈనెల 9నుంచి 15వ తేదీ వరకు, ధర్మాబాద్–నిజామాబాద్ రైలును 8 నుంచి 14వరకు, నిజామాబాద్–పండరీపూర్ రైలును 9 నుంచి 15వ తేదీవరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటనలో వివరించారు.

సిట్టింగులు.. తాయిలాలు!

- ఆర్మూర్ నియోజకవర్గంలో రైస్ కుక్కర్లు..
- బాల్కొండలో చీరలు, గడియారాలు..
- ఎన్నికల కోడ్ రాకముందే పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థులు
- ఇతర నియోజకవర్గాల్లోనూ పంపిణీకి సిద్ధమవుతున్న ఎమ్మెల్యేలు
- మరోవైపు కులసంఘాల భవనాలకు ప్రొసీడింగ్స్, శంకుస్థాపనలు
- రోడ్లపై గుంతల చుట్టూ గులాబీ రంగు పూసి యువకుల నిరసన
- అపరిష్కృత సమస్యలను సోషల్ మీడియాలో ఎత్తిచూపుతున్న యువత

ప్రజాసమస్యలు వినే విషయంలో గత ఐదేళ్ల కాలంలో సిట్టింగు ఎమ్మెల్యేల చిత్తశుద్ధిని శంకించవచ్చేమో కానీ, ఐదేళ్లకొకసారి వచ్చే ఎన్నికల సమయంలో ఇచ్చే తాయిలాల విషయంలో మాత్రం వారి చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేకుండా చేసుకుంటున్నారు. ప్రజలను కేవలం ఐదేళ్లకోసారి తామిచ్చే తాయిలాలు తీసుకునే ఓటర్లుగా మాత్రమే ప్రజాప్రతినిధులు చూస్తుండడంపై వివిధ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కాంగ్రెస్, బీజేపీలు ఎన్నికల ప్రవర్తన నియమావళి విడుదలయ్యాక తమ అభ్యర్థులను ప్రకటించేందుకు నిర్ణయించుకోగా అధికార పార్టీ బీఆర్‌ఎస్ మాత్రం ముందుగానే అభ్యర్థులను ప్రకటించింది. జిల్లాలో అన్ని స్థానాల్లో సిట్టింగులకే టిక్కెట్ల కేటాయింపు జరిగింది. టిక్కెట్లు ఖరారైనప్పటి నుంచి ఆయా నియోజకవర్గాల్లో సిట్టింగులు ప్రజలను కులాల వారీగా విభజించి ఓట్లు రాబట్టుకునేందుకు ఎత్తుగడలు వేస్తుండడం విశేషం. ఈ క్రమంలో కులసంఘాలకు భవనాల కోసం ప్రొసీడింగ్స్ ఇస్తూ శంకుస్థాపనలు చేస్తున్నారు. కాగా గత పదేళ్లుగా తమపై చూపని ప్రేమ ఇప్పుడు చూపించడం పట్ల అత్యధిక మంది లోలోన రగిలిపోతున్నారు. మరోవైపు ఎన్నికల కోడ్ విడుదలకు కౌంట్‌డౌన్ నడుస్తున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు కొందరు ఎమ్మెల్యేలు తాయిలాలు ఇచ్చే కార్యక్రమం షురూ చేశారు.



ఆర్మూర్‌లో పంపిణీ చేస్తున్న రైస్‌కుక్కర్లు



బాల్కొండలో ఇస్తున్న చీరలు



బాద్గుణ రోడ్డుపై గుంతల చుట్టూ పింక్ కలర్

'అన్నం – జీవనన్నం'..

ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఇప్పటికే రైస్ కుక్కర్ల పంపిణీ మొదలుపెట్టారు. కుక్కర్లపై 'అన్నం–జీవనన్నం' కారు గుర్తుకే మనోటు స్టిక్కర్ అతికించి మరీ ఇస్తుండడం గమనార్హం. కుక్కర్లతో పాటు గోడ గడియారాలు పంపిణీ చేస్తున్నారు. ఇది చూసిన పలువురు యువకులు గ్రామాల్లో వివిధ సమస్యలపై సోషల్‌మీడియా వేదికగా సెటైర్లు వేస్తున్నారు.

'పింకీ గుంతలు'..

నందిపేట మండలం బాద్గుణ గ్రామానికి చెందిన కొందరు యువకులు గురువారం ఎమ్మెల్యే పర్యటన నేపథ్యంలో రోడ్డుపై ఉన్న గుంతల చుట్టూ గులాబీ రంగు పూశారు. ఇవి 'ఇంకుడు గుంతలు కాదు – పింకీ గుంతలు' అంటూ సోషల్ మీడియాలో సెటైరికల్‌గా వీడియోలు విడుదల చేస్తున్నారు. నువ్వు గతంలో ఇచ్చిన హామీలు మర్చిపోలేదు.. ఇకపై నీ హామీలు నమ్మేది లేదంటూ వీడియోల్లో పేర్కొంటున్నారు. మేము ఏళ్లతరబడి ఈ గుంటల రోడ్లపై తిరుగుతున్నాం. నీకు ఇబ్బంది కలుగకూడదని జాగ్రత్తగా వచ్చేందుకు గుంతలు కనిపించేలా పింక్ కలర్ పూసినట్లు పేర్కొంటున్నారు. ఇది వైరల్ అవుతోంది. కొందరు యువకులు జీవన్‌రెడ్డి ఇచ్చిన సీఎంఆర్‌ఎఫ్ డబ్బులు తిరిగి ఇచ్చేస్తామంటూ, ఇందుకు తమ భార్యల పుస్తెలు తాకట్టు పెట్టినట్లు వీడియోలు విడుదల చేసి వైరల్ చేస్తుండడం విశేషం. జీవన్‌రెడ్డి బనాయించే అక్రమ కేసులకు భయపడేది లేదంటూ వీడియోల్లో చెబుతున్నారు.

'ప్రశాంతన్న దసరా కానుక'

మంత్రి ప్రశాంత్‌రెడ్డి అనుచరులు బాల్కొండ నియోజకవర్గంలో విలువైన చీరలు పంపిణీ చేస్తున్నారు. చీరల బాక్సులపై 'ప్రశాంతన్న దసరా కానుక' అని ప్రింట్ చేయించారు. వీటితో పాటు గోడ గడియారాలు పంపిణీ చేస్తున్నారు. బట్టాపూర్ గుట్ట అక్రమ తవ్వకాలు, కొన్ని నెలలకే కూలిన చెక్‌డ్యాంలపై సోషల్ మీడియాలో యువకులు మంత్రి గురించి విమర్శలు చేస్తుండడం గమనార్హం. ఇదిలా ఉండగా మిగిలిన నియోజకవర్గాల్లో సైతం సిట్టింగులు తాయిలాల పంపిణీకి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇలా ముందుగానే తాయిలాల పర్వానికి తెరతీయడంతో రానురాను ఈ వ్యవహారం ఎంతవరకు వెళుతుందోననే చర్చలు జరుగుతున్నాయి.

బదిలీల మాయ

- ఇంగ్లిష్ మీడియం టీచర్లు.. తెలుగుమీడియంగా దరఖాస్తు
- ఫలితంగా అర్హులైన వారికి తగ్గిన ప్రాధాన్యత
- గందరగోళంగా విద్యాశాఖ మెరిట్‌లిస్టు !



నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖ నిబంధనలను పట్టించుకోకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం కారణంగా బదిలీల ప్రక్రియలో అనేక లోటుపాట్లు చోటుచేసుకుంటున్నాయి. ఎస్జీటీ బదిలీలకు సంబంధించి విద్యాశాఖ 97 మంది ఉపాధ్యాయులతో మెరిట్ లిస్టును విడుదల చేసింది. బోధన్‌లోని ప్రభుత్వ పాఠశాల ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తున్న ఐదుగురి పేర్లు ఇందులో ఉండగా, వారిని మెరిట్ లిస్టులో తెలుగుమీడియం ఉపాధ్యాయులుగా పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా బోధన్‌లోనే కొనసాగుతున్న వారు.. జిల్లా కేంద్రానికి రావడానికి ఏకంగా మీడియంనే మార్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ విభాగం ఇంగ్లిష్ మీడియం పాఠశాలలు జిల్లాలోని బోధన్, డిచ్‌పల్లిలో రెండుమాత్రమే ఉన్నాయి. ఇంగ్లిష్ మీడియం విభాగానికి చెందిన ఎస్జీటీలు పదోన్నతులు, బదిలీలైనా అవే పాఠశాలల్లో కొనసాగాలి. దీనిని తప్పించుకునేందుకు ఉపాధ్యాయులు తెలుగు మీడియం విభాగంలోకి వచ్చినట్లు ఆరోపణలున్నాయి. ఇందులో ఓ ప్రధాన సంఘం నాయకుడి భార్య, మరికొందరు ఉన్నారు. మరోవైపు ఆ పాఠశాల నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తే వారిస్థానంలో ఐదుగురు ఉపాధ్యాయులు తెలుగు మీడియంకు చెందిన వారు రావాల్సి ఉంటుంది.

తెలుగు మీడియం ఉపాధ్యాయులు వస్తే విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం బోధన అందకుండాపోతుంది. సదరు ఐదుగురు ఉపాధ్యాయుల కారణంగా అర్బన్ మెరిట్ లిస్టులో మార్పులు జరిగాయి. అర్హులైన ఐదుగురు టీచర్లు వీరికంటే వెనక్కి వెళ్లిపోయారు. కేవలం మీడియం, విభాగం మారడం వల్ల ఇవన్ని సమస్యలు ఉత్పన్నమయ్యాయి. విద్యాశాఖ తప్పిదాలవల్లే ఇలాంటివి కొనసాగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధం

బోధన్ మధుమలాంచ ప్రభుత్వ పాఠశాల ఇంగ్లిష్ మీడియంకు చెందిన ఉపాధ్యాయులు తెలుగు మీడియం పేరుతో మెరిట్ లిస్టులోకి వెళ్లారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. మళ్లీ మా పాఠశాలకు టీచర్లు వచ్చే అవకాశం లేకుండా పోయింది. ఉన్నతాధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలి. – నరేందర్, హెచ్‌ఎం, మధుమలాంచ, బోధన్

తెలుగుమీడియం అని చెప్పారు

బోధన్‌కు చెందిన ఐదుగురు టీచర్లు తెలుగు మీడియంకు చెందినవారే. వారుకూడా అదే చెప్పారు. దరఖాస్తులను పరిశీలిస్తాం.
– దుర్గాప్రసాద్, డీఈవో

ప్రతిఒక్కరూ సీపీఆర్ శిక్షణ తీసుకోవాలి

నిజామాబాద్‌నాగారం: రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు గవర్నర్ తమిళిసైకి బాసర అమ్మవారి చిత్రపటంతో పాటు ప్రసాదాన్ని గురువారం హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ వచ్చే ఏడాది సెప్టెంబర్ 17 వరకు ప్రతి ఒక్కరూ సీపీఆర్ శిక్షణ తీసుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్లు బాధ్యత తీసుకొని ప్రతిపాఠశాలలో సీపీఆర్ శిక్షణ ఏర్పాటు చేయాలని సూచించారు. సొసైటీ బలో పేతానికి సభ్యత్వాన్ని చేపట్టాలన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో చైర్మన్ బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, నిజామాబాద్ సీపీఆర్ ట్రైనర్ డాక్టర్ శ్రీశైలం, రామకృష్ణ ఉన్నారు.



గవర్నర్‌కు ప్రసాదం అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

క్లుప్తంగా

చెట్టు రోగనిరోధక శక్తిని అభివృద్ధి పరుస్తాయి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ బయెటెక్నాలజీ విభాగంలో గెస్ట్‌లెక్చర్‌ కార్యక్రమం గురువారం నిర్వహించారు. యూఎస్‌ఏ నార్త్‌కరోలినా స్టేట్‌ యూనివర్సిటీ రీసెర్చ్‌ సైంటిస్ట్‌ డాక్టర్‌ రాజారపు స్వప్నప్రియ 'ఎవల్యూషన్‌ ఆఫ్‌ ఫిజియోలాజికల్‌ మెకానిజం ఇన్‌ ఇన్సెక్ట్‌' అనే అంశంపై చర్చించారు. వృక్షాలు తమ రోగ నిరోధకశక్తిని ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకుని కీటకాల నుంచి రక్షించుకుంటాయని వివరించారు. అమెరికాలో ఉన్నత విద్యావకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం స్వప్నను బయెటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీవోస్‌ చైర్మన్‌ ప్రవీణ్‌ మామిడాల, హెచ్‌వోడీ జవేరియా ఉజ్మా, అధ్యాపకులు కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): తెయూ కంప్యూటర్‌ సైన్స్‌ కాలేజీలో ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాన్ని రిజిస్ట్రార్‌ యాదగిరి సందర్శించి పరీక్షల తీరును పరిశీలించారు. పరీక్షలు రాస్తున్న స్కాలర్స్‌కు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. దివ్యాంగులు, అంధ విద్యార్థులు ఉంటే వారితో స్ర్కైబర్స్‌ను అనుమతించాలని ఆదేశించారు. పరీక్షలకు 135 మందికి హాజరు 132 మంది హాజరు కాగా 3గురు గైర్హాజరైనట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం.అరుణ, ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ఆరతి తెలిపారు.

ఔట్‌సోర్సింగ్‌ సిబ్బంది నిరసన



తెయూ(డిచ్‌పల్లి):తెయూ యూనివర్సిటీ క్యాంపస్‌ ప్రధాన కూడలిలో ఔట్‌సోర్సింగ్‌ సిబ్బంది మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. గతంలో సీఎం కేసీఆర్‌ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఔట్‌సోర్సింగ్‌ సిబ్బందిని రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రవీందర్‌నాయక్‌, మధులిక, నవ్య, మౌనిక, ఆసిఫ్‌, శ్రీకాంత్‌, బబ్లు, గంగాధర్‌, బాబురావు, పాల్గొన్నారు.

ట్రాలీ ఆటోపై కేసు నమోదు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ట్రాలీ ఆటోపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. మండలంలోని ఐలాపూర్‌ గ్రామానికి చెందిన నీరడి రమేశ్‌ తన ట్రాలీ ఆటోలో సుమారు 35మందిని ఎక్కించుకొని తాడ్వాయి మీదుగా కామారెడ్డి వెళ్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మంత్రాల నెపం మోపడంతో..

గాంధారి(ఎల్లారెడి): మండలంలోని తిమ్మాపూర్‌లో గ్రామస్తులు ఓ కుటుంబంపై మంత్రాల నెపం మోపడంతో అవమానం భరించలేక ఊరు వదిలి వెళ్లిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలో ఓ మహిళ చేతబడి చేస్తుందని ఆరోపిస్తూ 20 రోజుల క్రితం కొందరు దూషించి పంచాయతీ పెట్టి సదరు కుటుంబాన్ని హెచ్చరించారు. దీంతో వారు అవమానభారంతో ఊరు వదిలి వెళ్లిపోయినట్లు సమాచారం. కొన్ని రోజులు మేడిపల్లిలో ఉన్న బంధువుల ఇంట్లో ఉండి బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లిపోయినట్లు తెలిసింది.

కానిస్టేబుల్‌ ఫలితాలు విడుదల

- సివిల్‌లో 266, ఏఆర్‌కు 134 మంది ఎంపిక
- అదనంగా ఎక్సైజ్‌, రవాణా, ఫైర్‌, టీఎస్‌ఎస్పీ పోస్టులు
- ఎంపికైన వారి లాగిన్‌లో ఈనెల 7 నుంచి 10 వరకు



ఖలీల్‌వాడి: కానిస్టేబుల్‌ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తూ ఫలితాలను టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ ప్రకటించింది. జిల్లాలో 266 సివిల్‌, ఏఆర్‌ 134 కానిస్టేబుళ్ల పోస్టులతోపాటు అదనంగా ఎక్సైజ్‌, రవాణా, ఫైర్‌, టీఎస్‌ఎస్పీ పోస్టులు ఉన్నాయి. ఏడాది క్రితం ప్రభుత్వం జిల్లాలో నోటిఫికేషన్‌ విడుదల చేయగా ప్రిలిమనరీ, ఫిజికల్‌ టెస్ట్‌, మెయిన్స్‌, సర్టిఫికేషన్‌ నిర్వహించారు. మెయిన్స్‌లో మార్కుల ఆధారంగా జూన్‌ 14 నుంచి 23 వరకు జిల్లా కేంద్రంలోని పోలీస్‌పరేడ్‌ గ్రౌండ్‌లో 5313 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలువగా 4736 మంది మాత్రమే హాజరయ్యారు. నాటి నుంచి తుది ఫలితాల కోసం అభ్యర్థులు ఎదురుచూడగా నెలన్నర క్రితం ఎస్సై ఫలితాలను విడుదల చేశారు. వీరికి ప్రస్తుతం ట్రైనింగ్‌ కొనసాగుతోంది. తాజాగా ఫలితాలు వెలువడడంతో అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

7 నుంచి 10 వరకు..

జిల్లాలో సివిల్‌, ఏఆర్‌, ఎక్సైజ్‌, రవాణా, ఫైర్‌, టీఎస్‌ఎస్పీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌లలో ఈ నెల 7 నుంచి 10 వరకు అటెస్టేషన్‌ పత్రాలు అందుబాటులో ఉంటాయని టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ ప్రకటించింది. వాటిని డిజిటల్‌గా ఫిల్‌ చేసి, డౌన్‌లోడ్‌ చేసి, ఫొటోలు అతికించి, మూడు సెట్లపై గెజిటెడ్‌ సంతకాలు చేయించి పత్రాలను 12, 13వ తేదీల్లో జిల్లా కమిషనరేట్‌ కార్యాలయాల్లో అందించాల్సి ఉంటుంది.

ఏ పోస్టుల వారు ఎక్కడ అందించాలి

- జిల్లాలో సివిల్‌, ఏఆర్‌ కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులు అటెస్టేషన్‌ పత్రాలను జిల్లా కమిషనరేట్‌ కార్యాలయంలో అందించాలి.
- ఎస్పీఎఫ్‌, ఏఎస్‌ఆర్‌–సీపీఎల్‌, రవాణా కానిస్టేబుల్‌ అభ్యర్థులు హైదరాబాద్‌లోని గోషామహల్‌ స్టేడియంలో సమర్పించాలి.
- టీఎస్‌ఎస్పీ, ఐటీ అండ్‌ కమ్యూనికేషన్‌, ఫైర్‌మన్‌, ఎక్సైజ్‌, వార్డర్లు, రవాణా కానిస్టేబుల్‌ అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని కమిషనరేట్‌ కార్యాలయంలో అందించాలి.

కటాఫ్‌ వివరాలు...

జిల్లాలో సివిల్‌ పోలీసుల విభాగంలలోని పురుష అభ్యర్థుల(ఓపెన్‌ కేటగిరి) కటాఫ్‌ మార్కులు 123 కాగా ఓసీలకు 114, బీసీలకు 76, ఎస్సీలకు 103, ఎస్టీలకు 110, ఈడబ్ల్యూఎస్‌కు 80, అలాగే మహిళలకు అన్ని కేటగిరీల్లో 80 వరకు ఉంది. కాగా ఏఆర్‌కు అన్ని కేటగిరీలు పరిగణనలోకి తీసుకుంటే కనిష్ఠ మార్కులు 64 తీసుకున్నట్లు తెలుస్తోంది.


సుద్దపల్లి శరత్‌, గంగసరం (బెటాలియన్‌)


దినేశ్‌ యాదవ్‌, నూత్‌పల్లి (బెటాలియన్‌)


సూర్యతేజ, కమ్మర్‌పల్లి (బెటాలియన్‌)


పసుపుల వినీత్‌, కమ్మర్‌పల్లి (ఫైర్‌)


నడికట్ల శివ, చౌట్‌పల్లి (సివిల్‌)


కుర్మ అభినవ్‌, బషీరాబాద్‌ (సివిల్‌)

సాక్షి నెట్‌వర్క్‌:రాష్ట్ర పోలీస్‌ రిక్రూట్‌మెంట్‌బోర్డ్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన కానిస్టేబుల్‌ రాత, శారీరక పరీక్షలతో పాటు ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసిన అభ్యర్థుల తుది జాబితాను పోలీస్‌శాఖ విడుదల చేసింది. అభ్యర్థుల వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఇందులో ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా అభ్యర్థులు అధిక సంఖ్యలో ఎన్నికయ్యారు. దీంతో గ్రామాల్లో హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నాయి. తాము పడ్డ కష్టానికి ప్రతిఫలం దక్కిందని అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



హరీశ్‌, పడకల్‌ శృతి, కొలిప్యాక్‌


రోహిత్‌, కమ్మర్‌పల్లి (సివిల్‌)


సంతోష్‌, కమ్మర్‌పల్లి (బెటాలియన్‌)


కల్లెడ నవీన్‌, కమ్మర్‌పల్లి (సివిల్‌)


కుర్మ ప్రణయ్‌, బషీరాబాద్‌ (ఏఆర్‌)


కుర్మ గణేశ్‌, బషీరాబాద్‌ (బెటాలియన్‌)


తోట కావేరి, అమీర్‌నగర్‌ (ఏఆర్‌)


మర్యాల భార్గవి, ఎడపల్లి (ఏఆర్‌)


ప్రణయ్‌, రాణాకలాన్‌ (సివిల్‌)


మోత్కురి గౌతమి, రుద్రూర్‌ (సివిల్‌)


అరవింద్‌, సురేశ్‌, వెంగల్‌పహాడ్‌ (ఏఆర్‌)

సివిల్‌ కానిస్టేబుళ్లుగా భార్యాభర్తల ఎంపిక


కానిస్టేబుళ్లుగా ఎంపికైన సుమన్‌, సౌమ్య

సిరికొండ: రావుట్ల గ్రామానికి చెందిన భార్యాభర్తలు మందముల సుమన్‌, సౌమ్య సివిల్‌ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. మైలారం గ్రామానికి చెందిన అన్నదమ్ములు బైరగోని వాల్మీకిగౌడ్‌, గిరిధర్‌గౌడ్‌, పోత్నూర్‌ గ్రామానికి చెందిన అన్నదమ్ములు మేకల భరత్‌, మేకల దినేశ్‌లు సైతం సివిల్‌ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. రావుట్ల నుంచి మరో ఐదుగురు, తాటిపల్లి నుంచి ఐదుగురు, చీమన్‌పల్లి నుంచి నలుగురు, దుప్య తండా నుంచి నలుగురు, సిరికొండ నుంచి ఒకరు, ముషీర్‌నగర్‌ నుంచి ఒకరు, కొండాపూర్‌ నుంచి ముగ్గురు, వర్జన్‌ తండా నుంచి ఒకరు, గోప్యానాయక్‌ తండా నుంచి ఒకరు, పాకాల నుంచా ఒకరు, మైలారం నుంచి ముగ్గురు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. దీంతో ఆయా గ్రామాల్లో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఒకే కుటుంబంలో ఏఆర్‌ కానిస్టేబుళ్లుగా నలుగురి ఎంపిక


ఏఆర్‌ కానిస్టేబుళ్లకు ఎంపికైన కుటుంబ సభ్యులు

వర్ని: మండలంలోని శ్యామ్‌రావు తండాకు చెందిన నలుగురు ఉమ్మడి కుటుంబం నుంచి ఏఆర్‌ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. బర్దావాల్‌ భారతి బాయి, ఘాజీ రాముల ముగ్గురు పిల్లలు రాష్ట బాయి, మహేందర్‌, రాజేందర్‌తో పాటు ఘాజీరామ్‌ తమ్ముడు బీరుమల్‌, మధుబాల కుమారుడు యశ్వంత్‌ సైతం ఏఆర్‌ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. గ్రామం నుంచి నలుగురు ఏఆర్‌ కానిస్టేబుళ్లుగా ఎంపిక కావడంపై గ్రామస్తులు వర్షం వ్యక్తం చేస్తున్నారు.

లక్షమందికి డీఎస్‌ హెల్త్‌కార్డులు

- మాజీ మేయర్‌ ధర్మపురి సంజయ్‌


మాట్లాడుతున్న మాజీ మేయర్‌ సంజయ్‌

ఖలీల్‌వాడి: లక్ష మందికి డీఎస్‌ హెల్త్‌కార్డులు అందిస్తామని కాంగ్రెస్‌ సీనియర్‌ నేత, మాజీ మేయర్‌ ధర్మపురి సంజయ్‌ అన్నారు. నగరంలోని ధర్మపురి సంజయ్‌ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన నివాసంలోని కార్యాలయంలో ఆధార్‌కార్డు తీసుకొని వచ్చిన వారికి ప్రతి రోజు హెల్త్‌కార్డులు అందించనున్నట్లు తెలిపారు. ఈ హెల్త్‌కార్డులు నగరంలోని హోప్‌, ఇండోస్‌, మెడికవర్‌, ప్రుడెన్స్‌, శ్రీకృష్ణ హాస్పిటళ్లలో వర్తిస్తాయని, హాస్పిటల్‌ ఖర్చుల్లో 30 శాతం రాయితీ ఉంటుందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్డు అన్ని రకాల రోగాలకు వర్తిస్తుందన్నారు. పేర్లు నమోదు చేయించుకున్న వారికి వెంటనే కార్డును అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆసుపత్రి సిబ్బంది, కాంగ్రెస్‌ నేతలు సందీప్‌ సార్ధ, వెంకటేశ్వర్‌రావు, బెల్లాల పోతన్న, ప్రమోద్‌, హకీ శ్రీనివాస్‌ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్‌

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

నందిపేట్‌(ఆర్మూర్‌): నందిపేట మండలం ఉమ్మెడ శివారులోని గోదావరి నదిలో షేక్‌ ఖదీర్‌(50) అనే వృద్ధుడు పడి మృతి చెందినట్లు ఎస్సై రాహుల్‌ తెలిపారు. ఆర్మూర్‌ పట్టణానికి చెందిన షేక్‌ ఖదీర్‌ వృత్తిరీత్యా కూలీ పనిచేస్తుంటాడు. పనిలో భాగంగా మంగళవారం నందిపేట్‌ మండలంలో పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. ఉమ్మెడ శివారులోని గోదావరి నదిలో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టగా ఖదీర్‌ మృతదేహంగా గుర్తించారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు నదిలోకి వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెంది ఉంటాడన్నారు. మృతుడి కుమారుడు షేక్‌ అస్లాం ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కిందపడి ఒకరు..

నవీపేట: యంచ శివారులోని గోదావరి నదికి సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి బుధవారం రాత్రి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్‌ మహబూబ్‌ గురువారం తెలిపారు. మృతుడి వయస్సు 40 సంవత్సరాల వరకు ఉంటాడన్నారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

చెరువులో పడి వృద్ధురాలు..


ఎంకవ్వ మృతదేహం

భిక్కనూరు: మండల కేంద్రంలోని బొబ్బిలి చెరువులో ప్రమాదవశాత్తు పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఎంకవ్వ(68) రెండు సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతోంది. గురువారం ఉదయం ఆసుపత్రికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. గ్రామ చెరువులో మృతిచెందినట్లు కుటుంబీకులు గుర్తించారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి చెరువులో పడి మృతి చెందినట్లు కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి కుమారుడు సిద్ధిరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

దోమకొండ: మండలంలోని సీతారాంపల్లి గ్రామానికి చెందిన పుట్ట రాములు(62) అనారోగ్యంతో బాధపడుతూ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బీబీపేట ఎస్సై సాయిరెడ్డి గురువారం తెలిపారు. కొంతకాలంగా కడుపులో కణితితో బాధపడుతున్న రాములు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, నలుగురు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడిని కాపాడిన యువకులు

నవీపేట: యంచ గోదావరి నదిలో దూకి గురువారం ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడిని యంచ యువకులు కాపాడారు. ఇందల్వాయి మండలానికి చెందిన గంగారాం కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు యత్నించాడు. ఆత్మహత్య చేసుకునేందుకు బ్రిడ్జిపై నుంచి యత్నించగా అటువైపుగా వెళ్తున్న యంచ యువకులు అప్రమత్తమై కాపాడారు. అనంతరం కుటుంబ సభ్యులకు విషయాన్ని వెల్లడించగా వారు వృద్ధుడిని తీసుకెళ్లాను. యువకులను గ్రామస్తులు అభినందించారు.

బాన్సువాడలో చోరీ

బాన్సువాడ/ బాన్సువాడ రూరల్‌: పట్టణంలోని పాత బాన్సువాడకు చెందిన బోడ విక్రమ్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డిల ఇంట్లో దుండగులు బీరువాలను పగులగొట్టి రూ. 4 లక్షల నగదును అపహరించినట్లు సీఐ మహేందర్‌ రెడ్డి గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బేతాళస్వామి ఆలయం వద్ద నివాసముంటున్న బోడ విక్రమ్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డిల ఇళ్లల్లో మురళి అనే వ్యక్తి గుమస్తాగా పని చేస్తున్నాడు. బుధవారం పనిముగించుకొని గుమాస్తా ఇంటికి తాళం వేసి వాచ్‌మన్‌కు అందించాడు. రాత్రి దొంగతనం జరిగినట్లు గుర్తించి యజమానులకు మురళి సమాచారం అందించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హాస్టల్‌ సమస్యలను పరిష్కరించాలి

నిజామాబాద్‌అర్బన్‌: నగరంలోని న్యాల్‌కల్‌ రోడ్‌ వద్ద గల హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌ జావేద్‌కు గురువారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల పాలకవర్గాల ప్రమాణస్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న శంభుని గుడి కమిటీ పాలకవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న జెండా బాలాజీ ఆలయ కమిటీ..


ప్రమాణ స్వీకారం చేస్తున్న హమాల్‌వాడీ సాయిబాబా ఆలయ కమిటీ..

నిజామాబాద్‌ సిటీ: జిల్లా కేంద్రంలోని ప్రముఖ ఆలయాల నూతన పాలకవర్గం సభ్యులు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ ఏ క్షణమైన వెలువడే అవకాశం ఉండటంతో పాలకవర్గం ప్రమాణా స్వీకార కార్యక్రమం చేయించారు. దేవాదాయ శాఖ పరిశీలకురాలు కమల నూతన పాలకవర్గం సభ్యులతో ప్రమాణా స్వీకారం చేయించారు. అనంతరం ఆలయాల పాలకవర్గం సభ్యులు అర్బన్‌ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తాను కలిసి సన్మానించారు.

శంభునిగుడి పాలకవర్గం..

నగరంలోని శంభుని గుడి ఆలయ కమిటి నూతన చైర్మన్‌గా గాండ్ల లింగం, డైరెక్టర్లుగా అట్టెం మహేష్‌, మాకు రవికుమార్‌, సురుకుంట్ల భాస్కర్‌, ధర్ని అరుణ్‌కుమార్‌, తుమ్మల స్వరూప, కొండ రాఘువేంద్రలు ప్రమాణా స్వీకారం చేశారు.

జెండా బాలాజీ ఆలయం..

జండా బాలాజీ ఆలయం పాలకవర్గం చైర్మన్‌గా జాలిగాం గోపాల్‌కు మరోసారి చైర్మన్‌గా అవకాశం కల్పించారు. వీరితో పాటు నలుగురు కొత్త డైరెక్టర్లు అగ్గు సంతోష్‌, దొర్నల రాజేశ్వర్‌, తుమ్మల నాగభూషణం, గైనీ విజయ్‌, పాత డైరెక్టర్లు పొలకుండా నర్సింగ్‌రావు, ఎముగంటి రాముగౌడ్‌లను పొడగించటంతో ప్రమాణస్వీకారం చేశారు.

హమాల్‌వాడీ ఆలయం..

నగరంలోని హమల్‌వాడీ సాయిబాబా మందిరం చైర్మన్‌గా మాదస్‌ శ్రీధర్‌ను మరోసారి పొడిగించారు. ఈసందర్భంగా శ్రీధర్‌తోపాటు, డైరెక్టర్లుగా భూమేశ్వర్‌, మేక లక్ష్మీ, శోభ, పుట్ట రమేష్‌, మధుసూధన్‌ ప్రమాణస్వీకారం చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- జెడ్పీ చైర్మన్‌ దాదన్నగారి విఠల్‌రావు



నిజామాబాద్‌నాగారం: అంగన్‌వాడీ, పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీ చైర్మన్‌ దాదన్నగారి విఠల్‌రావు అధికారులను ఆదేశించారు. విద్య, వైద్యం, ఐసీడీఎస్‌, పలు శాఖలపై స్టాండింగ్‌ కమిటీలో గురువారం సమీక్షించారు. పాఠశాలల్లో పిల్లలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సీడీపీవోలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేయాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నార్మల్‌ డెలివరీల సంఖ్య పెరిగిందన్నారు. అనంతరం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకష్ణన్‌ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సమావేశంలో సీఈవో గోవింద్‌, డీఈవో దుర్గాప్రసాద్‌, ఆయుష్‌ జిల్లా అధికారి డాక్టర్‌ రామ్మోహన్‌, ఐసీడీఎస్‌ పీడీ రసూల్‌బీ, జడ్పీటీసీ సభ్యులు ఎర్రం ముత్యం, షాంబాల్‌ శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.


హాస్టల్‌ సమస్యలను పరిష్కరించాలి

- అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి
- రిజిస్ట్రార్‌ యాదగిరి


విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్‌

తెయూ(డిచ్‌పల్లి): తెయూ బాలుర, బాలికల హాస్టళ్లలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రిజిస్ట్రార్‌ ఎం.యాదగిరి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం మెయిన్‌ క్యాంపస్‌లోని న్యూ బాయ్స్‌ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్స్‌లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని చీఫ్‌ వార్డెన్‌ మహేందర్‌రెడ్డిని, విద్యుత్‌ సమస్య లేకుండా చూడాలని ఎలక్ట్రిషియన్‌ను, హాస్టల్స్‌ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఎస్టేట్‌ ఆఫీసర్‌ను, సెక్యూరిటీ గార్డ్స్‌ 24 గంటలు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని, కాంపిటేటివ్‌ పరీక్షలకు సంబంధించి అన్ని పుస్తకాలను కొనుగోలు చేయాలని లైబ్రేరియన్‌ సత్యనారాయణను ఆదేశించారు. విద్యార్థులు పోటీ పరీక్షలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రిజిస్ట్రార్‌కు అందజేశారు. రిజిస్ట్రార్‌ వెంట ఆడిట్‌సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌, వైస్‌ప్రిన్సిపాల్‌ ఎం.సత్యనారాయణ, పీఆర్‌వో పున్నయ్య, హాస్టల్స్‌ కేర్‌టేకర్స్‌ క్రాంతికుమార్‌, దిగంబర్‌ చౌహాన్‌, సిబ్బంది ఉన్నారు.

మహిళలపై దాడుల నివారణలో ప్రభుత్వాలు విఫలం



డిచ్‌పల్లి: మహిళలపై నిత్యం జరుగుతున్న దాడులను నివారించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని తెయూ కాంట్రాక్టు అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ పి.సరిత అన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మండలంలోని ఓ ప్రైవేటు కళాశాలలో 'అమ్మాయిలపై దాడులు– పోరాటాలు' అనే అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. మద్యం అమ్మకాలు పెంచుతూ ప్రభుత్వాలు యువతను పక్కదారి పట్టిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జన్నారపు రాజేశ్వర్‌, దేవిక, వి.సంతోష్‌, శివసాయి, రవీందర్‌, అక్షయ్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

వైకుంఠధామాల తాళాలు తెరవాలి


అర్సపల్లి వైకుంఠధామం ముందు ధర్నా చేస్తున్న బీజేపీ నేత ధన్‌పాల్‌ సూర్యనారాయణ, స్థానికులు

ఖలీల్‌వాడి: నగరంలోని వైకుంఠధామాలను ఐటీ వల మంత్రి కేటీఆర్‌తో హడావుడిగా ప్రారంభించి, తాళాలు వేయడం సరైనది కాదని, వెంటనే వాటిని తెరవాలని బీజేపీ నేత ధన్‌పాల్‌ సూర్యనారయణ గుప్తా డిమాండ్‌ చేశారు. ఈమేరకు గురువారం ఆయన 14, 15వ డివిజన్‌లకు చెందిన ప్రజలతో కలిసి అర్సపల్లిలోని వైకుంఠధామం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వైకుంఠధామాలకు తాళం వేసి ఉంచడంతో దహన సంస్కరణలు ఎక్కడ చేయాలని ప్రశ్నించారు. వెంటనే వైకుంఠధామాలు తెరిచి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. లేకపోతే అన్ని వైకుంఠధామాల ముందు బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. నగరంలో ఎమ్మెల్యే అవినీతి మీద శ్రద్ధ పెట్టినట్లు ఆరోపించారు. కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించకపోవడంతోనే వైకుంఠధామాలకు తాళాలు వేసినట్లు ఆరోపించారు. అర్బన్‌ ఎమ్మెల్యే దత్తత తీసుకున్న డివిజన్‌లో పరిస్థితి దారుణంగా ఉందని, కులసంఘాలకు ప్రొసీడింగ్‌లు ఇవ్వడం కాదని, వారికి కావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. ఎన్నికలు రావడంతో కులసంఘాల వద్దకు ఎమ్మెల్యే వస్తున్నట్లు ఆరోపించారు. నాయకులు ఆర్మీ రమేష్‌, రంజిత్‌, నాగోల్ల లక్ష్మీనారాయణ, పవన్‌, ముందడ ఆశిష్‌, పల్నాటి కార్తీక్‌, కార్పొరేటర్లు మెట్టు విజయ్‌, ఎర్రం సుధీర్‌, పంచ రెడ్డి శ్రీధర్‌, గోపిడి వినోద్‌రెడ్డి, ప్రభాకర్‌, వినోద్‌ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా పట్టివేత

సిరికొండ: మండలంలోని దుప్య తండాలో నాటుసారా తయారు చేస్తుండగా ఇద్దరిని పట్టుకున్నట్లు భీంగల్‌ ఎక్సైజ్‌ సీఐ వేణుమాధవ్‌రావు గురువారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు తండాలో దాడులు నిర్వహించగా తండాకు చెందిన స్రవంతి, రంకు నాటు సారా తయారు చేస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిని తహసీల్దార్‌ రవీందర్‌రావు ఎదుట బైండోవర్‌ చేసినట్లు చెప్పారు. దాడిలో సిబ్బంది ఉన్నారు.

మత్స్య కార్మికులకు జీవనోపాధి


చేప పిల్లలు విడుదల చేస్తున్న దఫేదార్‌ రాజు

నిజాంసాగర్‌(జుక్కల్‌): కులవృత్తులపై ఆధారపడిన వారి కోసం సీఎం కేసీఆర్‌ పథకాలు అమలు చేస్తూ ఆదుకుంటున్నారని జెడ్పీ మాజీ చైర్మన్‌ దఫేదార్‌ రాజు అన్నారు. గురువారం నిజాంసాగర్‌ ప్రాజెక్టులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 48 లక్షల చేప పిల్లలు, 48 లక్షల రొయ్య పిల్లలను దఫేదార్‌ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మత్స్యశాఖ ఏడీ వరదారెడ్డి నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, తదితరులున్నారు.